అటెన్షన్ ప్లీజ్

## రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్

కోనరావుపేట: మండలంలోని నిజామాబాద్ గ్రామ పంచాయతీ ఆవరణలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ వ్యవస్థ లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. గ్రామపంచాయతీ ఆవరణ లోనే ఉండడంతో, గ్రామపంచాయతీ వద్ద స్థానికులు తరచూ వస్తుంటారని, ఈ ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు చేయాలని కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి:
వైకుంఠం, లైన్ ఇన్‌స్పెక్టర్,
సెల్ నెం. 91333 05588



చిత్రకథ



## రోడ్డు దిగితే పల్టీలే..!

బోయినపల్లి: మండల కేంద్రం నుంచి వేములవాడ వెళ్లే బీటీ రోడ్డుకు ఇరువైపులా పలుచోట్ల ఇటీవల వర్షాకాలంలో కురిసిన వర్షాలకు రోడ్డు కోతకు గురైంది. ప్రధానంగా బోయినపల్లి కల్వర్టు మూల వద్ద రోడ్డులో ఓ పక్క కోతతో కయ్య పడింది. ఎదురుగా వాహనం వచ్చిన సందర్భంలో రోడ్డు దిగితే వాహనదారులు కయ్యలో పడి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. కయ్యను పూడ్చి ప్రమాదాలు నివారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



## ప్రమాదపుటంచున ప్రయాణం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని అక్కపల్లి-బుగ్గరాజేశ్వరతండా గ్రామాల మధ్య ఉన్న రోడ్డు వెంట కల్వర్టుల వద్ద వర్షకాలంలో రోడ్డు కోతకు గురైంది. ప్రమాదకరంగా మారిన ఈ రోడ్డుపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్న పట్టించుకోవడం లేదు. ఇటీవల ద్విచక్ర వాహనదారుడు భూక్య నవీన్ ప్రమాదానికి గురై తీవ్రగాయాలతో ప్రాణాలతో బయటపడ్డాడు. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు నడిచే ఈ రహదారిలోని తెగిన రోడ్డును మరమ్మతులు చేయాలని ఈ ప్రాంత ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

క్లుప్తంగా

## నిబంధనలు పాటించాలి



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట: వాహనదారులు ఎన్నికల నిబంధనలను పాటిస్తూ, ప్రయాణాలు చేయాలని ఎల్లారెడ్డిపేట సీఐ శశిధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాచర్లగొల్లపల్లి శివారులో మంగళవారం రాత్రి పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. సరైన ధ్రువీకరణపత్రాలు లేని 9 వాహనాల యజమానులకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల నియమావళి ప్రకారం వాహనాలలో మద్యం, డబ్బులను తరలిస్తే సీజ్ చేసి, కేసులు నమోదు చేస్తామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి రోజూ వాహన తనిఖీలు చేపడుతున్నామన్నారు. తనిఖీల్లో ఎస్సై రమాకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

## స్నేహితుడికి కుటుంబానికి ఆర్థికసాయం



చెక్ అందజేస్తున్న రాంరెడ్డి

ముస్తాబాద్: గుండెపోటుతో మృతి చెందిన ముస్తాబాద్‌కు చెందిన దూలం పర్శరాములు కుటుంబానికి ఆయన స్నేహితులు అండగా నిలిచారు. 1994–95 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు రూ.51 వేల విలువైన చెక్కును ఆయన భార్యకు మంగళవారం అందజేశారు. పేదరికంతో బాధపడుతున్న ఆయన కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఎన్ఆర్ఐ యెల్ల రాంరెడ్డి ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులంతా కలిసి రూ.51 వేలను పోగుచేసి, పర్శరాములు కూతురి పేరిట డిపాజిట్ చేశారు. కార్యక్రమంలో నీరటి కిష్టయ్య, పదిర రాజాగౌడ్, దండబోయిన శ్రీనివాస్, పార్వతి రాజు, ప్రభులింగం పాల్గొన్నారు.

## తోటి ఉద్యోగికి నగదు సాయం



ఆర్థికసాయం అందిస్తున్న ఉద్యోగులు

బోయినపల్లి: మండల కేంద్రానికి చెందిన వాసాల సంతోష్ అనే కానిస్టేబుల్ తండ్రి వాసాల లక్ష్మీనారాయణ సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఈ క్రమంలో మండల ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తరపున మంగళవారం రూ.30 వేల నగదు ఆర్థికసాయాన్ని సంతోష్‌కు అందించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ మండలం నుంచి వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేసే ఉద్యోగులందరూ కలిసి సంఘంగా ఏర్పడ్డట్లు తెలిపారు. తోటి ఉద్యోగుల కుటుంబాలు ఆపదలో ఉన్న సమయంలో ఆదుకుంటామని వారు వివరించారు. సాయం చేసిన ఉద్యోగులకు సంతోష్ కృతజ్ఞతలు తెలిపాడు.

## మండల కోఆప్షన్ సభ్యత్వానికి రాజీనామా

కోనరావుపేట: మండల కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్ రషీద్ తన పదవికి, బీఆర్ఎస్ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు తెలిపారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న తాను మండల కోఆప్షన్ సభ్యత్వానికి, పార్టీకి రాజీనామా చేస్తున్న ఎంపీడీవోకు, జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడికి రాజీనామా చేశామన్నారు.

# అభివృద్ధికి దూరం..

• ఏళ్లుగా పేరుకుపోతున్న సమస్యలు • పరిష్కారానికి ప్రయత్నించని ప్రజాప్రతినిధులు • ఇబ్బందులు పడుతున్న ప్రజలు



అధ్వానంగా మారిన బైపాస్ రోడ్డు

కోనరావుపేట: పేరుకు మండల కేంద్రమైన కోనరావుపేట అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. మండల కేంద్రానికి ప్రతి రోజూ వివిధ గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో వస్తుంటారు. గ్రామంలో సరైన సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రంలో కొన్నేళ్ల నుంచి సమస్యలు పేరుకుపోతున్నాయి.

### రోడ్ల విస్తరణ పెండింగ్

➡ కోనరావుపేట బస్టాండ్ నుంచి గోదాం వరకు రోడ్డును 50 ఫీట్లుగా మార్చాలని పంచాయతీ పాలకులు తీర్మానించారు. కానీ ఇప్పటి వరకు అమలు కాలేదు.

➡ బస్టాండ్ నుంచి పశువుల ఆస్పత్రి వరకు 40 ఫీట్ల రోడ్డును చేయాలని, కొన్నేళ్ల క్రితమే నిర్ణయించారు.

➡ అంకంపేట చౌరస్తా నుంచి నిమ్మపల్లి రోడ్డును 30 ఫిట్లుగా, బస్టాండ్ నుంచి వయా పాత బ్యాంక్ నుంచి అంబేద్కర్ వరకు 40 ఫిట్లుగా మార్చాలని గతంలోనే తీర్మాణించినా పనులు కావడంలేదు.

### పూర్తికాని పనులు

➡ కోనరావుపేట మండల కేంద్రంలో బైపాస్ రోడ్డులో వంతెన నిర్మాణం కోసం రూ.35 లక్షలతో గతంలోనే ఎమ్మెల్యే రమేశ్‌బాబు పనులు ప్రారంభించినా పూర్తికాలేదు.

➡ ఆరోగ్య కేంద్రం పక్కన రూ.45 లక్షలతో ఆడిటోరియం పనులు మొదలుపెట్టి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు పనులు పూర్తికావడం లేదు.



అసంపూర్తిగా ఉన్న ఆడిటోరియం

### అమలుకు నోచుకోని సమస్యలెన్నో..

➡ కోనరావుపేటలో ప్రధాన రహదారిపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని గత కొన్నేళ్లుగా డిమాండ్ ఉన్నా అమలుకు నోచుకోవడం లేదు.

➡ మండల కేంద్రంలో గురువారం జరిగే వార సంతలో ఎలాంటి వసతులు లేవు.

➡ గిరిజన ఆశ్రమ పాఠశాలకు, ఐకేపీ భవనానికి ఇప్పటికీ సరైన రహదారి లేదు.

➡ కోనరావుపేట గ్రామంలోకి బస్సు రాకపోవడంతో వృద్ధులు, వికలాంగులు ఇబ్బందులు పడుతున్నారు.



ఇరుకుగా మారిన ప్రధాన రహదారి

### రహదారులతో ఇబ్బందులు



కోనరావుపేటలో గోదాంకు వెళ్లే రహదారి కోసం నిధులు మంజూరయ్యాయి. పనులు చేస్తున్న కాంట్రాక్టర్ కంకర పోసి మధ్యలో వదిలేసి వెళ్లారు. దీంతో కంకర రోడ్డుపై వెళ్లేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు స్పందించి రహదారి పనులు పూర్తి చేయిస్తే ఇబ్బందులు తొలగిపోతాయి.

– కస్తూరి మధుకర్‌రెడ్డి, కోనరావుపేట

### సమస్యలు పరిష్కరించాలి



మండల కేంద్రంలో ఎన్నో సమస్యలు సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. రహదారుల నిర్మాణాలకు ప్రతిపాదనలు తయారు చేసిన ఏళ్లు గడుస్తున్నాయి. కానీ పనులకు మాత్రం మోక్షం కలుగడం లేదు. గాంధీ విగ్రహం వద్ద ఇప్పటి వరకు బస్సు రావడం లేదు. బస్సు వస్తే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది.

– బత్తుల సామేలు, కోనరావుపేట

# మొగులు.. దిగులు



ధాన్యం కుప్పలపై కవర్లు కప్పిన రైతులు

• మార్కెట్ యార్డులో ప్రారంభం కాని కొనుగోళ్లు
• రెండ్రోజులుగా భయపెడుతున్న మబ్బులు
• పలు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిలువలు

బోయినపల్లి: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసిన రైతన్నలను వర్షం భయం వెంటాడుతోంది. రెండు రోజులుగా ఆకాశంలో మబ్బులు పడుతున్న నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 23 గ్రామాలు ఉన్నాయి. 13 వేల ఎకరాల్లో వరి పంటలు వేశారు. వరి కోసిన రైతన్నలు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించారు. ఆకాశం మేఘావృతంగా కావడంతో కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం కుప్పలు తడవకుండా ఉండేందుకు టార్పాలిన్ కవర్లు కప్పుతూ అనేక ఇబ్బందులు పడుతున్నారు. బోయినపల్లి మార్కెట్ యార్డులో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ఇటీవల ప్రారంభించారు. సుమారు 40 మంది రైతులు పెద్ద మొత్తంలో ధాన్యం కుప్పలు కేంద్రంలో పోశారు. యార్డులో ధాన్యం కుప్పలు పేరుకుపోయాయి. పలువురు రైతుల ధాన్యం తేమ శాతం వచ్చినప్పటికీ ఇంకా కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పలు గ్రామాల్లో సైతం కొనుగోళ్లు జరగడం లేదు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఉన్న సమయంలో వర్షాలు కురిస్తే రైతులు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. చాలా రోజులుగా పలువురు రైతులు ధాన్యం కుప్పలు పోసి ఉంచారు. ఈ సమయంలో వర్షం భయం వెంటాడుతుండడంతో పలువురు రైతులు ధాన్యం తడవకుండా రాత్రి కవర్లు కప్పుతూ, ఉదయం కవర్లు తీసి ధాన్యం ఆరబెడుతూ ఇక్కట్లు పడుతున్నారు. ధాన్యం కొనుగోళ్లు త్వరగా చేపట్టాలని పలువురు రైతులు కోరుతున్నారు.

## సీవీ రామన్ జయంతి

ఎల్లారెడ్డిపేట: స్థానిక జూనియర్ కళాశాలలో మంగళవారం సీవీ రామన్ 135వ జయంతిని నిర్వహించారు. సీవీ రామన్ జీవితచరిత్రపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు. సీవీ రామన్‌ను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రిన్సిపాల్ సత్యనారాయణ అన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వాసరవేణి పర్శరాములు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఎస్సై సుధాకర్

తంగళ్లపల్లి: శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అందరూ సహకరించాలని, ఎన్నికల నిబంధలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇల్లంతకుంట ఎస్సై దాస సుధాకర్ అన్నారు. మండలంలోని కందికట్కూర్ గ్రామంలో గ్రామస్తులకు మంగళవారం రాత్రి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికల్లో ఎవరైనా పాల్గొనవచ్చని ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుళ్లు సత్యనారాయణ, భూమయ్య, కానిస్టేబుళ్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ‘ఆరోగ్య మహిళ’కు విశేష స్పందన



పీహెచ్‌సీలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

సిరిసిల్లటౌన్: జిల్లాలో ప్రతి మంగళవారం జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళ శిబిరానికి మంచి స్పందన వస్తుందని డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్‌మోహన్‌రావు తెలిపారు. సిరిసిల్లలోని పీఎస్‌నగర్, వేములవాడ పీపీసీ, నేరెళ్ల, తంగళ్లపల్లి పీహెచ్‌సీల్లో మహిళలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ హెల్త్‌సెంటర్లలో నిర్వహించిన శిబిరాల్లో ఓపీడీ 570, బ్రెస్ట్ 524, ఓరల్ కావిటీ 542 పరీక్షలు జరిపినట్లు పేర్కొన్నారు. అలాగే యూటీఐ 13, ల్యాబ్ 78, థైరాయిడ్ 50, విటమిన్ డీ 40, సీబీపీ 68, సూక్ష్మ పోషకాలు 69 మందికి పరీక్షలు నిర్వహించి వీరిలో 9 మంది పేషెంట్లను జిల్లాసుపత్రికి రెఫర్ చేసినట్లు వివరించారు.

## కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పన



పరిశీలిస్తున్న రైతుబంధు సమితి అధ్యక్షుడు

ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం మోహినికుంటలో ఐకేపీ కొనుగోలు కేంద్రంలో రైతులకు అన్ని ఏర్పాట్లు చేశామని రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు తెలిపారు. ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో రైతుల ధాన్యాన్ని త్వరగా తూకం వేసేందుకు హమాలీలను మాట్లాడామన్నారు. అలాగే తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు వాహనాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ధాన్యాన్ని విక్రయించేందుకు అన్ని వసతులు కల్పించామన్నారు. గన్ని సంచుల కొరత లేదన్నారు.

సమాచారం

## గెస్ట్ లెక్చరర్లు కావలెను

గంభీరావుపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి.విజయలక్ష్మీ తెలిపారు. కళాశాలలో కామర్స్, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో పీజీ 55 శాతం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ కలిగిన వారికి, పూర్వానుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు. ఈ నెల 8న సాయంత్రం 4 గంటలలోపు కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు. ఈ నెల 9న కళాశాలలో ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

## నేడు సర్వసభ్య సమావేశం

వేములవాడఅర్బన్: వేములవాడ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నేడు బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బూర వజ్రమ్మ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ఉంటుందని ఎంపీడీవో శ్రీధర్ తెలిపారు. మండల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరుకావాలని కోరారు.

## సెల్‌ఫోన్ అప్పగింత



ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై ఆంజనేయులు

కోనరావుపేట: మండల కేంద్రానికి చెందిన కాసర్ల కాశీరాం సెల్‌ఫోన్ పోగొట్టుకొనగా సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా గుర్తించి బాధితుడికి ఎస్సై ఆంజనేయులు మంగళవారం అందజేశారు. అక్టోబర్ 25న తన సెల్‌ఫోన్ పోయినట్లు కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకున్నట్లయితే వెంటనే ఈఎంఐ నెంబర్‌తో ఫిర్యాదు చేయాలన్నారు.

## రక్షిత మంచినీటి కరువు



నాచుతో కూడిన ట్యాంక్

వీర్నపల్లి: మండలంలోని సీతారాంనాయక్ తండాలో గ్రామపంచాయతీ పరిధిలోని హిక్ష నాయక్ తండాలో కొన్ని నెలల నుంచి మిషన్ భగీరథ నీరు రాక దగ్గరలో ఉన్న బోరుబావి నుంచి, నాచుతో నిండి ట్యాంక్ నీరు తాగుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. 15 రోజులకు ఒకసారి ట్యాంకులను శుభ్రం చేసి, బ్లీచింగ్ చేయాల్సి ఉండగా, ఆరు నెలలకు, ఏడాదికి ఒకసారి శుభ్రం చేస్తున్నట్లు ఆ ట్యాంక్‌ను చూస్తే అర్థమవుతుంది. ఈ విషయంలో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రక్షిత మంచి నీటి ట్యాంకులను శుభ్రం చేసి ప్రతి ఇంటికి సురక్షితమైన మిషన్ భగీరథ నీరు అందించాలని తండా వాసులు కోరుతున్నారు.